నగల దోపిడి

ఇమంది రామారావు

"వందే శంభు ఉమాపతిం.
సురగురుం దేవం. వందే జగత్కారణం .... పార్వతీ! పార్వతీ కాఫీ అయిందా!" నమశ్శివాయ పంతులుగారు మళ్ళీ శ్లోకం పూర్తి చేయసాగాడు.

"పన్నగ భూషణం ముకుందం ప్రియం...." అంతే. పార్వతి మొహంలోకి చూశాక మరిక పెదవి కదల్లేదు. పార్వతి కళ్ళల్లో నీరు గిర్రున తిరిగింది. రివ్వుమంటూ వంట గదిలోకి పారిపోయింది పార్వతి.

నమశ్శివాయ పంతులుగారు ఆ ఊరికి దేవుడితో సమానం. శివాలయం కట్టినప్పటినుండీ అర్చన చేయడం. కేవలం ఆ పరమశివుని ఆరాధన కోసమే తాను పుట్టినట్టు భావించి, ఆ శివుని సేవలోనే తాదాత్మ్యం చెందాలన్న విశ్వాసం నమశ్శివాయది.

నమశ్శివాయకు అయిదుగురు పిల్లలు. నలుగురు ఆడ, ఒక మగ. నలుగురూ పెద్దవాళ్ళే. పెద్ద పిల్లలు యిద్దరు

శైలజ, రూపజ పెళ్ళీడుకొచ్చారు. మూడో పిల్ల ఈశ్వరి పుష్పవతి కావడానికి సిద్ధంగా వుంది. నాలుగోది భ్రమరాంబ అయిదో క్లాసు చదువుతోంది. చంటాడు శివయ్య.

పెద్దపిల్లలు ముగ్గురూ మంచం మీదనుండి యింకా లేవలేదు. మొండికేసి కాదు, ఒంట్లో శక్తిలేక. లేస్తే తూలిపడిపోతారేమో భయంచేత—అన్నం తిని నాలు గయిదు రోజులవుతోంది. శివయ్యకైనా అటుకుల ప్రసాదం పెట్టి యిది రెండో రోజు. నమశ్శివాయకి అన్నం లేకపోయినా పరవాలేదు. కాఫీ ఉదయం తాగితే సాయంత్రంవరకూ గడిపేయగలడు.

అదేమిటో మరి 'శివాలయం' కళ్ళచూస్తే నమశ్శివాయ పంతులుగారు వయసు మరిచిపోయి 'ఓం నమశ్శివాయః' శబ్దంచేస్తూ వెయ్యి మెట్లూ యిట్టే ఎక్కిపోతాడు. గర్భ గుడిలో ప్రవేశించాక భక్తుల్ని చూసిన ఆనందంలో ఈ భౌతిక ప్రపంచాన్ని మరిచిపోతాడు. అలాగే గడుపు కొస్తున్నాడు యిన్నాళ్ళూ.

"పార్వతీ!" తలుపు చాటున సిగ్గుపడుతూ నిలబడ్డాడు శివయ్య.

"ఏవండీ. ఈ రోజు మీరు భత్యం తీసుకురాకపోతే పిల్లలు బలవంతంగా చచ్చిపోతారు. చంటాడికి మీరు అటుకులు పెట్టి ఎన్నాళ్ళయింది. వాడు మీరున్నారని, తిడతారని భయంతో ఊపిరి బిగపెట్టి బిక్కుబిక్కు మంటున్నాడుగాని, మీరిలా గుమ్మం దాటాక చూడండి వాడి ప్రతాపం. నా మీద విరుచుకుపడతాడు. పాలవాడు నిర్మొహమాటంగా చెప్పేశాడు — చచ్చి గింజుకున్నా మరిక పాత బాకీలన్నీ చెల్లించేవరకూ పాలుపోసేది

లేదుట. ఈ సంసారంతో ఎలా చచ్చేది చెప్పండి" అను కోకుండా కోపాన్ని తమాయించుకోలేకపోయింది.

"పార్వతీ! యివన్నీ ఆ పరమశివుడికి తెలియదనా.... హూఁ....ఎందుకో పరీక్షలు పెడుతున్నాడు. పెట్టనీ! నాకు అరవై దగ్గర పడుతుంది. యింతకాలం సిగ్గుకు రాలేదూ .... అయినా భక్తులకు పరీక్షలు తప్పవు పార్వతీ!" ఆప్యాయంగా ఓరడిస్తూ ఆమె మొహంలోకి చూశాడు.

పార్వతి తల దించుకుంది.

ఎక్కువసేపు ఆమె మొహం చూడలేకపోయాడు. "నమశ్శివాయ" అంటూ శఠగోపురం, పళ్లెం, తీర్థం, పూలసజ్జ పట్టుకొని శివాలయానికి బయలుదేరాడు.

పార్వతి భర్త కేసి అట్టే చూడలేకపోయింది. కళ్ళ నిండా దుఃఖం పులుముకుంది. కాళ్ళల్లో తలదాచుకొని భోరున ఏడ్చింది.

2

సుగివలస చిన్న పల్లెటూరు.

ఉదయం తొమ్మిది గంటలవుతుంది.

ఆలయ ప్రాంగణంలోనే చిన్న కుటీరంలాంటిది ఊరి పెద్దలంతా నిర్మించారు. అందులో యోగానందస్వామీజీ వుంటున్నారు. నలభై సంవత్సరాలుగా కఠిన బ్రహ్మ చర్యం పాటిస్తూ భక్తులకు జ్ఞానబోధనతో కాలం గడుపుతున్న యోగి—తను మాత్రం తెల్లవారుజామున నాలుగ్గంటలకే లేచి శుచిగా స్నానపానాదులు ముగించి శివనామస్మరణతో కాలక్షేపం చేస్తూంటారు.

ఊళ్ళో చిన్నపిల్లలందరూ ప్రసాదం కోసం ఎనిమిది గంటలకు సుమిగూడుతారు. స్వామీజీ అటుకుల ప్రసాదం

పంచుతున్నారు.

నమశ్శివాయ పంతులుగారు స్వామీజీని చూడగానే "ఓం నమశ్శివాయ" అని పలుకరించాడు. స్వామీజీ చిరునవ్వుతో ప్రతి నమస్కారం చేశాడు.

నమశ్శివాయ పంతులు శివునికి అభిషేకం ప్రారంభించి సహస్ర నామాలతో పూజచేయడంలో నిమగ్నమయి పోయాడు. కొంచెం తులసి తీర్థం తీసుకొనేసరికి ఎక్కడ లేని శక్తి వచ్చింది. పార్వతిదేవి గుడి ప్రక్కనేవుంది. తాళాలు తీసుకొని వెళ్ళాడు.

పార్వతిదేవి గర్భగుడిలోకి ప్రవేశించినపుడు నమశ్శివాయ పంతులుకి భయమేస్తుంది. అమ్మవారికి తాళిబొట్టు, కళ్ళు, మెడలో కట్టలకాసుల పేరు, వడ్డాణం, కాళ్ళకు బంగారపు మట్టెలు, సుమారు నాలు గయిదు లక్షలు విలువచేసే నగలు విజయనగరం మహా రాజావారు సమర్పించినవి గత యాభై సంవత్సరాలుగా కాపాడుకొంటూ వస్తున్నాడు.

పార్వతీదేవిని చూడగానే కళ్ళు జిగ్గుమన్నై. తొందరగా పూజ ముగించాడు. తలుపులు మూసి తాళం వేయబోతుండగా యోగానంద స్వామీజీ విచ్చేశాడు.

"నమశ్శివాయగారూ! ఒక్కక్షణం. నేను ఇక్కడికి వచ్చిన రెండు సంవత్సలనుండి గమనిస్తున్నాను. మీరు శివాలయంలో గడిపినంత ప్రశాంతంగా పార్వతీదేవి ఆలయంలో గడపలేరు ఎందుకని. ఆమెను చూస్తే మీకు భయమా? ఆ జగన్మాత అందం తనివితీరా చూడండి. జిగేల్మంటూ మెరిసే ఆ కళ్ళు, రవ్వల కెంపుల ముక్కు పుడక, నత్తు, బేసరి, చెవులకు జూంకీలు, మెడలో చంద్ర హారం, కట్టలకాసుల పేరు, నడుంకి వడ్డాణం, కాళ్ళకు

బంగారపు మట్టెలు నిజంగా చూడ్డానికి రెండు కళ్ళు చాలడం లేదనుకోండి!" అంటూ నమస్కరించాడు.

నమశ్శివాయ పంతులు అందరిలాగే స్వామీజీని కూడా ఆశీర్వదించి, తీర్థం యిచ్చి తలుపులు మూశాడు.

3

పంతులుగారు "శివా!" అంటూ అరిచి.... స్పృహ తప్పి పడిపోయాడు, పార్వతీదేవి గర్భగుడిలో.

పార్వతీదేవి నగలు మాయమయ్యాయి. ఒంటిమీద పట్టుచీరతో సైతం దోచుకుపోయారు ఎవరో—

భక్తులు పంతులుగారిని లేవనెత్తి మొహంమీద నీళ్ళు చల్లారు.

"నా తల్లి ... నగలు ... వడ్డాణం, కట్టలకాసుల పేరు, చంద్రహారం, జుంకీలు, మట్టెలు, నత్తు, బేసరి, అన్నీ మాయమైపోయాయి. పరమశివా! ఏవిటయ్యా ఈ పరీక్ష!" నెత్తిబాదుకొని భోరున ఏడవసాగాడు.

"ఏమయ్యింది పంతులుగారూ!" అంటూ హడావుడిగా వచ్చాడు యోగానంద స్వామిజీ. పార్వతీదేవి నగలు పోవడం చూసి క్షణం రెప్పార్చలేకపోయాడు. గర్భగుడిలోకి ప్రవేశించి అంతా గాలించాడు. ఒక 'పాడి' కూడా రాలకుండా జాగ్రత్తపడ్డారు దొంగలు.

"పంతులుగారూ! ఎలా సంభవించింది?" అని అడిగాడు.

"అంతా ఆ పరమేశ్వరుడికే తెలియాలి! పరమశివా! నీ అర్చనలో కొన్ని లక్షల పరీక్షలు పట్టావు. నెగ్గ తాననే ఆత్మవిశ్వాసంతో అన్నిటినీ ఎదిరించాను. కాని ఈ ఒక్క పరీక్షనీ తట్టుకోలేనయ్యా!" అంటూ సింహ

ద్వారానికేసి తలబాదుకోసాగాడు. స్వామీజీ ఊరడించాడు.

క్షణాల్లో ఈ వార్త ఊరంతా గుప్పుమంది. దూర ప్రాంతాలనుండి జనం రాసాగారు. వేలకొద్దీ జనంతో—ఊరి ప్రముఖులతో—ధర్మకర్తతో శివాలయం కిటకిటలాడిపోయింది.

"అన్యాయం! ఘోరం! గుడికట్టి యాభయ్ సంవత్సరాలవుతుంది. యింతవరకూ యిలాంటి సంఘటన ఒక్కటీ జరగలేదు సరికదా కనీసం ఆలయ ప్రాంగణంలో పూలు కూడా దొంగిలించిన పాపాన ఏ ఒక్కరూ పోలేదు! ఈ ఊరికేదో మూడింది. అరిష్టం పట్టింది!" అన్నాడు ఆదినారాయణ.

ఆదినారాయణ, గున్నారావులు ఆ ఊరికి పెద్ద మనుషులు. ఇద్దరూ ఉత్తర దక్షిణ ధృవాలు. ఏ సమస్య పరిష్కరించాలన్నా వారికే వదిలేస్తారు.

ఆదినారాయణకి వయసు డబ్బయి సంవత్సరాలు దగ్గర పడుతున్నై. గున్నారావు మంచి వయసులో వున్నాడు. ఊరందరికంటె తెలివయినవాడు. యోగ్యుడు. ప్రపంచ జ్ఞానం తెలిసినవాడు. కనుక గున్నారావునీ, తల పండిన ముసలి తలకాయి కదా ఆదినారాయణని పెద్దమనుషులుగా నిర్ణయించారు. వేలాది జనం గున్నారావు ఈ సమస్యను ఎలా పరిష్కరిస్తాడోనని ఎంతో ఉత్సాహంతో ఎదురు చూడసాగారు.

"ఏమంటారు గున్నారావుగారూ!" అనడిగాడు సుబ్బయ్యశెట్టి.

"ఈ శివాలయం తాలూకూ తాళం చెవులు ఎవరి దగ్గర వున్నాయి!" గున్నారావు అడిగాడు.

"నా దగ్గరేవున్నాయండీ. అయితే .... యిందులో కొంచెం లిటిగేషనుంది. ఆదినుండీ రెండు తాళంచెవులు సెట్టులు మా యిద్దరి దగ్గరా వుండేవి. ఒకటి నా దగ్గరా ఒకటి మన నమశ్శివాయ పంతులుగారి దగ్గర వుండేవి. అయితే ఓ పది సంవత్సరాలు పోయిం తర్వాత పంతులు గారి తాళంచెవులు వాడటం మానేశారు. ఏవండీ ఎందుకు వాడలేదు అనడిగితే పోయాయండీ మీ తాళం చెవులు ఇవ్వండీ అన్నాడు — మనిషి నమ్మకస్తుడు. భక్తుడు. నమ్మాలనిపించింది. తాళం చెవులు ఇచ్చాను. సాయంత్రం ప్రతిరోజూ నాకే ఒప్పగించమని చెప్పేను. నేను చెప్పినట్లే గత నలభయ్ సంవత్సరాలుగా ఉదయం నా కిరాణా దుకాణానికి వచ్చి తాళం చెవులు తీసుకు వెళ్ళడం, సాయంత్రం ఇంటికి వెళ్ళేముందు ఒప్పగించడం చేసేవాడు. ఈ రోజు ఈ అఘాయిత్యం జరిగింది!" అంటూ గుండె బాదుకున్నాడు ధర్మకర్త.

"ఇదంతా బాగానే వుందయ్యా! నిన్న సాయంత్రం నమశ్శివాయ పంతులు ఇంటికి వెళ్ళేముందు తాళంచెవులు మీకిచ్చాడా లేదా?" నిలదీసి అడిగి చుట్ట వెలిగించాడు ఆదినారాయణ.

"ఇచ్చాడండి" సుబ్బయ్య శెట్టి అయోమయంగా చూశాడు.

"అంటే నిన్న సాయంత్రం తాళంచెవులు యిచ్చి ఈ రోజు ఉదయం మళ్ళీ మీ దగ్గర్నుండి తీసుకు వెళ్ళారు నమశ్శివాయ పంతులుగారు. గుడిలో పార్వతీ దేవి నగలు కనిపించలేదు. అంతేకదా — యిందులో పంతులుగారు నిర్దోషి. తాళంచెవులు ఎవరి దగ్గర వున్నాయో వారి గురించే ఆలోచించాలి" అన్నాడు

గున్నారావు.

సుబ్బయ్య శెట్టికి విషయం అర్థమయింది. గున్నారావు తనని అనుమానిస్తున్నాడు. ఆయన అనుమానించడం మొదలుపెడితే యిక యింతే సంగతులు అని తీర్మానించుకొన్నాడు.

"గున్నారావుగారు! మా అమ్మ తోడు. మా బాబు తోడు. మా తాత తోడు. మా యిలవేలుపు కన్యకా పరమేశ్వరి తోడు. మీ తోడు. నాకీ నగలు మాయమవ్వటం గురించి తెలీదు బాబోయ్!" అంటూ గొంతు చించుకొని ఏడ్చాడు.

గున్నారావుకి ఆదినారాయణకి ఒకరికొకరికి పడదు. ఒకరు ఫలానావార్ని సపోర్టు చేస్తున్నారని తెలిశాక మరొకరు రెండో పార్టీకేసి తిరిగిపోతారు. వాదించుకుంటారు. బలాబలాలు తేల్చుకుంటారు. గున్నారావు సమశ్శివాయ పంతుల్ని సపోర్టు చేస్తున్నట్లు తెలిసిపోయింది ఆదినారాయణకి—

ఆదినారాయణ సుబ్బయ్య శెట్టి మొహంలోకి చూశాడు. అతి భయంకరంగా, దీనాదిదీనంగా వుంది. ఈ గండం గడిచి గట్టెక్కితే, ఈ వాదు తనమీద లేకుండా చేస్తే జీవితాంతం ఋణపడతాను. మీరేమడిగితే అది యిస్తాను — అన్నట్లు వున్నాయి శెట్టి చూపులు.

"అయ్యా! నువ్వడిగిన పోయింటు బాగానే వుంది. మరయితే కోవిల కట్టిన ఆ గదిలో రెండు సెట్టుల తాళం చెవులు మన పెదగాడు నర్సింహులు దగ్గర చేయించడం నాకు తెలుసును—అందులో వొకటి మన సుబ్బయ్య శెట్టికి యిచ్చాం. మరొకటి పంతులుగారికిచ్చాం. సుబ్బయ్య శెట్టి

దగ్గరున్న తాళంచెవి భద్రంగా వుంది. పంతులుగారి దగ్గర వుంచింది పోయింది అని ఆయన చెప్పినట్లు శెట్టిగారు చెప్తున్నారు. అంతేనా శెట్టిగారూ!" ధర్మకర్త మొహం చూశాడు.

"సత్య ప్రమాణంగా అంతే బాబూ!" అంటూ లెంపలు వేసుకొని ఏవో మంత్రాలు చదవసాగాడు. పెదవులు వేగంగా కదలసాగాయి.

"అయ్యా! సుబ్బారావు. మరి నువ్వంటే చిన్నోడివి. నీకొన్ని విషయాలు తెలుసు. మరికొన్ని తెలీవు. యాభయ్ సంవత్సరాలుగా పంతులుగార్ని నాకు తెలుసు. యెప్పుడూ మరి ఇలాంటి తప్పుడుపని చేయలేదు. 'వినాశకాలానికి విపరీత బుద్ధి' అంటారు. ఏమో. పంతులుగారిని అనుమానించడంలేదు. ఆయన దగ్గరున్న తాళంచెవులు పోయినట్టు గ్యారంటీ ఏమిటండీ" అందరి మొహాల్లోకి చూశాడు ఆదినారాయణ.

అందరూ డైలమాలో పడ్డారు. నమశ్శివాయ మొహంలోకి పరీక్షగా చూడసాగారు.

"అవునండోయ్. యిదీ పాయింటే!" అన్నాడు మరొక పెద్ద.

"మామూలు పాయింటు కాదండీ. చాలా గొప్ప పాయింటు. శెట్టిగారు నాకు తెలుసు. నాలుగయిదు లక్షలు విలువచేసే బంగారాన్ని ఆయన దగ్గర చాలా కాలం వుంచాను. రవ్వంత మోసం చేయలేదు. నా వరకూ ఆయన మీద ఎలాంటి అనుమానంలేదు. యిక నగలు ఎలా పోయాయన్నది నిర్ణయించవల్సింది వుంది. అయ్యా! సుబ్బారావూ....ఏం చేద్దాం!" అని అడిగాడు.

"పంతులుగారు. మీ దగ్గర తాళంచెవులు పోయి

ఎన్ని సంవత్సరాలు అవుతుంది?" గున్నారావు తాపీగానే అడిగాడు.

"నలభయ్ సంవత్సరాల క్రిందటిమాట!"

"అదే అపుడు ఎలా పోయాయి. దార్లోపోయాయా? ఎవరయినా దొంగిలించుకుపోయారా? తాళంచెవులు పోయినట్లు ఎప్పుడు తెలుసుకున్నారు?"

"అదీ! నాకు పెళ్ళయిన కొత్తలో బాబూ! వంట్లో అనారోగ్యంగా వుంది. ఆ రోజు శనివారం. కార్తీక సోమవారాలు నాలుగు వారాలూ గడిచిపోయాయి. కోవెలకి రద్దీ తగ్గింది. యింటికి వచ్చినప్పుడే ఒళ్ళు సలసల కాలిపోతుంది. తాళంచెవులు పార్వతికి ఇచ్చాను. తను అలవాటు ప్రకారం పూజగదిలో పెట్టింది. అంతవరకే నాకు తెలుసు. తర్వాత కన్ను తెరవకుండా వారం రోజులు మంచానపడ్డాను. మళ్ళీ శనివారం వచ్చింది. వంట్లో ఓపిక తెచ్చుకొని శివాలయానికి తయారయ్యి తాళంచెవులు కోసం పూజగదిలోకి వెళ్ళాను. గుండె జల్లుమంది. లేవు.

ఈ విషయం సవివరంగా ధర్మకర్తగారికి మనవి చేశాను. ఆ రోజు తిరిగి కోవెల్లో ప్రవేశించినపుడు ధర్మకర్తగారి స్వహస్తాల్తో తాళం తీశారు. నగలు భద్రంగా వున్నాయి.

అప్పటినుండీ ప్రతిసాయంత్రం వారికే ఒప్పగించి వెళుతున్నాను.... యింతవరకూ 'పూచిక పుల్ల' కూడా దొంగిలించబడలేదు. ఈ పాపం నేను చేయలేదు అని మాత్రం చెప్పగలను! నిజానిజాలు ఆ సర్వేశ్వరుడికే తెలియాలి!" అన్నాడు గుండెమీద చేయివేసుకొని కనురెప్పలు మూస్తూ.

"చాలా విచిత్రంగా వుందే. శెట్టిగారి దగ్గర తాళం చెవులుండటం, ఉదయం పంతులుగారు వచ్చేసరికి తాళాలు వేసినవి వేసినట్లే వుండటం, గర్భగుడిలో చూసే నగలు మాయమవడం నిజంగా ఈశ్వరేచ్ఛ!" అన్నాడు స్వామిజీ.

భక్తులంతా తలలూపేరు అయోమయంగా.

"అవును స్వామిజీగారు. మీరు ఎంత కాలంగా వుంటున్నారు?" అనడిగాడు గున్నారావు.

"ఏది రెండు సంవత్సరాలుగా వుంటున్నాను ఈ కుటీరంలో."

"మిమ్మల్ని ఎవరు తీసుకొచ్చారు స్వామీ!"

"శెట్టిగారి ధర్మపత్ని!"

"అవును గున్నారావుగారు. నా భార్య కన్యకాపరమేశ్వరి గుడికి వెళితే స్వామిజీ 'మోక్ష మార్గం' గురించి అనర్గళంగా గంటసేపు ఉపన్యాసించటం, భక్తులు మంత్రముగ్ధులయి వినడం చూసి భక్తి విశ్వాసంతో తీసుకొచ్చింది. స్వామివారి రాక మాకున్నూ కూడా శుభసూచకమయింది. ఆలయానికి వొచ్చే జనానికి మంచి కాలక్షేపం అని అందరూ అంటున్నారు. అసలు వారి ఉపన్యాసం మీరు వినలేదా?" అనడిగాడు.

"స్వామిజీవారి వుపన్యాసం వినే వారి 'విశ్వరూపం' చూసే అదృష్టం నా కింతవరకూ కలగలేదు. చూడండి స్వామిగారూ! అమ్మవారి నగలు మీరు చూడటం తటసించిందా?" అనుమానంగా స్వామిజీ కళ్ళల్లోకి చూశాడు.

స్వామిజీ శెట్టిగారికేసి చూశాడు. శెట్టిగారు 'అపరాధం మన్నించండి' అన్నట్లు చూశాడు.

"చూశాను బాబూ! కాని, నాకు ఆ కుటీరంలో తప్ప మరో ప్రపంచంతో సంబంధంలేదు. యిది సత్యం!" అని

గట్టిగా చెప్పేడు.

"సరే లక్షమాటలెందుకు! రాత్రి గుళ్ళో దోపిడీ జరుగుతుండగా, మీకు ఏవిధమైన శబ్దం వినిపించలేదా?" గున్నారావు గంభీరంగా అడిగాడు.

"లేదు. ముందే చెప్పేనుకదా. నాకీ ప్రపంచంతో సంబంధంలేదని-నేనా జగన్మాత ధ్యానంలో కూర్చుంటే నాకీ బాహ్య ప్రపంచం వినిపించదు" అన్నాడు కళ్ళు మూసుకొని.

"సరే—మీరు దైవ స్వరూపులు కావచ్చు—అయినా మీ కుటీరం సోదా చేయించాలి. అలాగే నమశ్శివాయ పంతులుగారి యిల్లుకూడా సోదాచేయించాలి. ధర్మకర్త గారింటికి మేమే స్వయంగా వెళ్ళి చూస్తాం. పూర్వాపరాలు బాగా ఆలోచించిగాని ఒక నిర్ణయానికి రాలేను. యిందులో మొదటి ముద్దాయి మీరే....మీరెంత ధ్యాన ముద్రలో వున్నా కోవెల్లో జరిగే యింత దోపిడీ మీకు తెలియదంటే నేను నమ్మను. నిజం చెప్పాలి. మీరు చెప్పకపోయినా తెలుసుకోగలను! ఇకపోతే రెండవ అనుమానితుడు శెట్టిగారు. తాళంచెవులు ప్రస్తుతానికి ఆయన దగ్గరే వున్నై. యిది యీనాటిది కాదు నలభై ఏళ్ళుగా వున్నమాట. నిజమని మీరంతా ఒప్పుకున్నారు. రాత్రికి రాత్రి నగలు మాయం చేయవలసిన అవసరం ఎవరికుంటుంది? శెట్టిగారు ఆశపడి ఈ ప్రయత్నం చేయొచ్చు—మూడవ ముద్దాయి నమశ్శివాయ పంతులు. ఆయన దగ్గర తాళంచెవులు పోయాయన్నది నిజంకాదని ఆదినారాయణగారు,తదితరులు ఆరోపించడంవలన. ఏమో ఇది కూడా నిజం కావచ్చు, నిజం కాకపోవచ్చు. ముందు ఈ కేసు పరిశోధన జరగాలిగా! నాలుగయిదు లక్షల

రూపాయల విలువైన నగలు పోయాయంటే ఊరికే అరిష్టం! దీన్ని పరిష్కరించి తీరాలి. మీరంతా సహకరించాలి!" అని అందరికేసి చూశాడు.

అందరూ ఏకగ్రీవంగా ఒప్పుకున్నారు.

చీకటిపడింది. అందరూ అక్కడ్నుంచి కదిలారు.

4

"ఇదీ జరిగిన కథ" అంటూ సవివరంగా కంప్లయింట్ ఇచ్చాడు గున్నారావు.

ఇన్స్పెక్టర్ మోహన్ రిపోర్టు ఒకసారి చూసుకున్నాడు. గున్నారావు చెప్పిన వివరాలన్నీ నోట్ చేసుకున్నాడు. మోహన్ గున్నారావు మంచి ఫ్రెండ్సు.

మోహన్ కింగ్ సైజు గోల్డుఫ్లాక్ గున్నారావుకి ఆఫర్ చేశాడు. ఇద్దరూ వెలిగించారు. ఆలోచనల్లో పడ్డారు.

"మోహన్‌గారూ! ఈ కేసులో మీరు ఎవర్ని అనుమానిస్తున్నారు?" ఆసక్తిగా అడిగాడు గున్నారావు రింగులు వదులుతూ.

"మీ రెవర్ని అనుమానిస్తున్నారో ముందు చెప్పండి!" ఎదురు ప్రశ్న వేశాడు మోహన్.

"నాకెందుకో ఆ యోగానంద స్వామిజీ మీద అనుమానముందండీ!"

"ఆయన దగ్గర తాళాలు లేవుగా!"

"లేవు. కాని స్వామిజీ ఆ ముందు రోజే అమ్మవారి నగల్ని పట్టిపట్టి చూసినట్లు పంతులుగారు చెప్పేరు. ఏదయినా మారు తాళాలతో తీయొచ్చుగా!"

"నో నో.... అంత తేలిగ్గా వచ్చేవికావు. అయినా ఆ తాళం గురించి నాకు తెలుసు. మొన్న సింహాచలంలో

నగల దోపిడీ జరిగిన తరువాత డి.ఐ.జి.గారు అన్ని టెంపిల్స్‌నీ చెక్ చేయిస్తున్నారు. ఆ సందర్భంగా సంగివలస గుడినీ చెక్ చేశాం. చాలా గట్టి తాళంకప్ప లుండీ అవి. బద్దలకొట్టడానికైనా ఒకరోజు టైము పడు తుంది. అందులోనూ ఒరిజినల్ తాళపుచెవులు వుంటేనే గాని నగలు తీయడం అసాధ్యం!" అన్నాడు మోహన్ ఆలోచిస్తూ.

అయిదు నిముషాలు యిద్దరిమధ్య నిశ్శబ్దం రాజ్యం చేసింది.

"ఒన్ థింగ్ గున్నారావుగారూ! నగలదోపిడీ గురించి మనం అట్టే పట్టించుకోనట్టు నటిద్దాం. నేను ధర్మకర్త గారిని, మీరు స్వామిజీని వెంటాడుదాం. ఇద్దరిలో ఎవరో ఒకరు తప్పకుండా ముద్దాయిలౌతారని నా నమ్మకం. మనం ఒత్తిడి తీసుకొచ్చినట్లయితే సుబ్బయ్య శెట్టిగాని, స్వామిజీగాని మరిన్ని పథకాలువేసి, అసలు నగలు మనకు దొరికే అవకాశం లేకుండా శాశ్వతంగా భూస్థాపితం చేయించొచ్చు."

"వారిని వెంటాడడం ఎలా?" గున్నారావు అను మానం.

"అవసరంలేదు గున్నారావుగారూ! మీరు తటస్థంగా వుండండి. వారే మన దగ్గరికి వస్తారు. వచ్చినపుడు జాగ్రత్తగా టేకిల్ చేద్దాం. బట్ ఒన్ థింగ్ స్వామీజీ మీదగాని, శెట్టిగారిమీదగాని అనుమానం వున్నట్లు మనం బయటపడకూడదు" అన్నాడు మోహన్.

"ఓహ్....ష్యూర్ ష్యూర్!" అంటూ హుందాగా స్టేషన్‌లోనుండి బయటికి నడిచాడు గున్నారావు.

"శ్రీ, ఆంజనేయస్వామి!"

"శ్రీ, ఆంజనేయస్వామీ!"

"పార్వతీదేవి నగలు పోయాయి!"

"పార్వతీదేవి నగలు పోయాయి!"

"అవి చూపించు తండ్రీ—ఎవరు తీశారో. ఇందులో నాకు కనిపించేలా చేయ్ తండ్రీ. నీకు కొబ్బరికాయ పెడతాను!" అంటూ చెప్పేడు భూతవైద్యుడు.

చుట్టూ ఆదినారాయణ, సుబ్బయ్యశెట్టి, స్వామిజీ, పంతులుగారు, మరికొద్ది మిత్రులూ వున్నారు. చిన్న అబ్బాయి మాత్రం భూతవైద్యుడి అరచేతిని పట్టిపట్టి చూడసాగాడు. అరచేతిలో నల్లటి కాటుక వుంది. అందులో నీడలా కనిపిస్తుంది.

"ఆ చూడు బాబూ! ఏం కనిపిస్తుంది ఇందులో...." అనడిగాడు భూతవైద్యుడు. అతడి దేహం చాలా విచిత్రంగా వుంది. వొంటినిండా విభూతి పులుముకున్నాడు. కళ్ళు చింతనిప్పుల్లా వెలిగిపోతున్నాయి. గారపళ్ళు.... గుండు గీయించుకుని, మొహంమీదకి జిడ్డుకారేలా నూనె రాసుకున్నాడు. చూడ్డానికి చాలా అసహ్యంగా వున్నాడు.

"ఏం కనిపించడంలేదు!"అని పెదవ్విరిచాడు కుర్రాడు.

"ఆ ఏం కనిపించడంలేదూ—సరిగ్గా చూడు పంతులుగారు కనిపిస్తున్నారా .... నేను కనిపిస్తున్నానా?" అనడిగాడు సుబ్బయ్యశెట్టి.

"పోనీ నేను కనిపిస్తున్నానా చెప్పు బాబూ!" సౌమ్యంగా అడిగాడు స్వామిజీ.

"ముగ్గురూ కనిపిస్తున్నారు!" అన్నాడు కుర్రాడు.

భూతవైద్యుడు కళ్ళు మూసుకున్నాడు. మంత్రాలు తనకే అర్థంకాని శబ్దంతో చదివేడు. గుప్పెడు విభూతి తీసి ఆ కుర్రాడి మొహంమీద ఊదాడు. ఆ కుర్రాడి కళ్ళు మండుతున్నాయి. కళ్ళనిండా విభూతి.

"సరిగ్గా చూసి చెప్పరా .... పంతులుగారు కనిపిస్తున్నారా?" అనడిగాడు ఆదినారాయణ.

"ఆ....ఆ....కనిపిస్తున్నారు!" అన్నాడు కుర్రాడు కళ్ళు తుడుచుకుని ప్రయత్నంమీద చూస్తూ.

"ఏం చేస్తున్నాడు?" శెట్టిగారు అడిగాడు.

"గుళ్ళోకి వచ్చారు .... పార్వతీదేవి గుడిలోకి వెళుతున్నారు....నగలున్నాయి.... పెద్ద వస్తువుని తీశాడు. ఒక్కొక్కటి తీస్తున్నాడు. మొత్తం తీశాడు. పంచెలో పెట్టుకున్నాడు!" అంటూ కనిపించిందాన్ని చెబుతున్నాడు. అందరూ పంతులుగారి మొహంలోకి చూడసాగారు.

పంతులుగారిలో చలనంలేదు. నిర్లిప్తంగా నవ్వాడు. కుర్రాడు కూడా పంతులుగారికేసి చూశాడు. ఒళ్లు జలదరించింది.

"ఇంకా ఏం కనిపిస్తుంది!" భూతవైద్యుడు అడిగాడు.

"మరేం కనిపించడంలేదు!" అన్నాడు కుర్రాడు లేచి నిలబడి.

"అయ్యా! ఇందులో కనిపించవలిసిందేంలేదు. పంతులుగారు తీసినట్టు అద్దంలో కనిపించినట్టు కనిపించింది. ఏందయ్యా" అంటూ కుర్రాడి మొహంలోకి చూశాడు. అవుననట్లు తలూపేడు కుర్రాడు.

"ఇళ్ళకు పోదాం. ఈభోగట్టా గున్నారావుకి తదితర పెద్దలకీ చెబుదాం. పోలీసు కంప్లయింట్ ఇద్దాం. నిజా

నిజాలు బయట పడతాయి" అంటూ లేచాడు ఆది నారాయణ.

భూతవైద్యుడికి వందరూపాయిల కాగితం చదివించాడు శెట్టి.

అంజనంకి అయిదు రూపాయిలు బదులుగా వంద రూపాయిలు వచ్చినందుకు తన అదృష్టానికి మురిసి పోయాడు. పంతులుగారు ప్రయత్నంమీద లేచి, అందరితోబాటు తనూ భారంగా అడుగువేశాడు.

6

"మీవారు ఎక్కడికెళ్ళారు ధనం?"

"విశాఖపట్నం వెళ్ళారు!"

"ఎందుకట!"

"ఎవరో డి.యస్.పి.గారో డి.ఐ.జి.గారో వారితో మాట్లాడాలని. ఆదినారాయణగారు రమ్మన్నారు. ఇద్దరూ వెళ్ళారు."

ధనలక్ష్మి స్వామిజీ కౌగిల్లో నలిగిపోతుంది. ధనలక్ష్మి పాలమీగడలాంటి శరీరంలో మెరిసిపోతుంది. ఆ అందాన్ని తనివితీరా జుర్రుకుంటున్నాడు స్వామిజీ.

"పంతులుగారు ఇంతకి తెగిస్తారనుకో లేదు!"

"అతి వినయం ధూర్త లక్షణం వినలేదూ. అసలు మిమ్మల్ని ఇక్కడికి తీసుకొచ్చింది ఇందుకే. దేవాలయానికి సంబంధించిన కొంతమంది పెద్దలు ఒప్పుకో లేదుట, మావారు సంప్రదిస్తే—పోనీలెండి పీడా విరగ డైంది. నిజం చెప్పాలంటే ఆ పంతులుగారి మొహం చూస్తేనే నాకు ఎలర్జీ స్వామిజీ" అంది స్వామిజీ ఛాతీ మీద ఉంగరాలు తిరిగిన వెంట్రుకల్ని నూతారంగా మీటుతూ.

"పోనీలే పేదపంతులు!" అన్నాడు జాలిగా.

"స్వామీజీ మనం ఎక్కడికయినా వెళ్ళిపోదామా!" అంది ఆశగా.

"ఎందుకూ?" తృళ్ళిపడ్డాడు స్వామిజీ.

"ఆయనతో కాపురం చేయడం ఎంత నరకంగా వుందో తెలుసా? చింతపండు బస్తా అంత పొట్ట. రెండు వందల కిలోల బరువూ. ఛీ ఛీ! అబ్బబ్బ మా అన్నయ్యని తిట్టాలి డబ్బుకి ఆశపడి రెండో పెళ్ళి చేసినందుకు!" అంది అసహ్యంగా మొహం పెట్టి.

"శెట్టిగారికి ఇంతకుముందు పెళ్ళయిందా?"

"పెళ్ళి .... పిల్లలు అంతా అయింది. ఈయనగారి ప్రతాపం, వయసూ అంతా మొదటి పెళ్ళాంతోనే పోయింది. నేను వచ్చేసరికి పెద్ద పొట్టమాత్రం మిగిలింది నన్ను చంపుకు తినడానికి" అంది. అప్రయత్నంగా ఆమె కళ్ళల్లో నీరు తిరిగింది.

"ధనం! మనం ఊరు విడిచిపెట్టి వెళితే 'నగలు' దొంగిలించామన్న అపవాదు తప్పకుండా మనమీదకే వస్తుంది. మరో సంవత్సరం ఆగుదాం. నీకు ఇప్పుడేం తక్కువని. అవసరమయినపుడు ఆయన్ని విజయనగరమో, విశాఖపట్టణమో పంపిస్తున్నావు లేదా మనమే వెళు తున్నాం. ఆయనకీ అనుమానం రాదు. మనకీ ప్రమాదం వుండదు. ఇపుడు బయటపడితే ఊరంతా తరిమి కొడతారు ముందు నన్ను" అని బోధపరిచాడు స్వామిజీ.

"స్వామిజీ!" అంటూ తలుపులు దబదబ బాదిన చప్పుడు. టైమ్ చూశాడు. రాత్రి తొమ్మిది నలభయ్ నిముషాలయింది.

"ఈ సమయంలో ఎవరొస్తారు చెప్మా!" అన్నాడు

స్వామిజీ కళ్ళు మూసుకొని ఆలోచించి.

"దివ్యదృష్టితో చూడండి!" అంది ప్రేమగా ఆయన కళ్ళల్లోకి చూస్తూ. స్వామిజీ కళ్ళు మూశాడు.

"హాఁ ఈ మధ్య నా ఉపన్యాసం విన్న వాళ్ళకి సందేహాలు ఎక్కువ కలుగుతున్నాయి. మొన్న కూడా యిలాగే అర్ధరాత్రి చప్పుడయింది. నువ్వే వచ్చావను కున్నాను. తలుపులు ఎంతో ఆశపడి తీసి నీరుగారి పోయాను. భక్తుడు. ధర్మసందేహం వచ్చిందట అడగ డానికి వచ్చాడు. కాదనలేకపోయాను. తెల్లవార్లూ ప్రశ్నమీద ప్రశ్న వేసి నన్ను చంపుకు తినేశాడనుకో" అంటూండగా మళ్ళీ తలుపు చప్పుడు వినిపించింది.

ధనలక్ష్మి చీర చుట్టుకొని, రవిక తొడుక్కొని, చెదిరి పోయిన జుత్తు సర్దుకొని, వెళ్ళి తలుపు తీసింది. స్వామి యోగముద్రలోకి వెళ్ళిపోయారు—ఎదురుగా గున్నారావు. షాక్ కొట్టినట్లు వెనక్కి వచ్చి పడింది.

"స్వామిజీ .... గున్నారావుగారు!" అంది తడ బడుతూ.

గున్నారావు వారిద్దరి పరిస్థితినీ గమనించాడు. స్వామిజీ ఫాలిమీద కుంకుమ వుంది. ధనలక్ష్మి జుట్టు చెదిరిపోయివుంది. స్వామిజీ పట్టు పీతాంబరం వదులుగా వుంది. మెళ్ళో రుద్రాక్షమాలలు లేవు. చేతికి తాయెత్తులూ లేవు.

"నమస్కారం స్వామిజీ!" అన్నాడు గున్నారావు.

"ఈశ్వరార్పణం. నమస్కారం గున్నారావుగారూ! ఏమిటిలా దయచేశారు. కబురుపెడితే మేమే వచ్చే వారిమిగా!" అన్నాడు తన తడబాటుని సర్దుకొంటూ.

"మీకంత శ్రమ ఇవ్వడం నాకు ఇష్టంలేదండీ. మీరు

జ్ఞానమార్గాన్ని అత్యుత్తమంగా బోధిస్తున్నట్లు దివిటీలా వెలిగిపోతున్న మీ మొహం చెబుతుంది. మిమ్మల్ని అనుమానించాను. ఆలయంలో దురుసుగా ప్రవర్తించాను. ఫలితంగా నాకు ఈ రోజు పాతిక వేలనష్టం వచ్చినట్లు తెలిసింది. నా బిజినెస్ ప్రారంభించి పదిహేను సంవత్సరాలయింది. ఇదే ఫస్టు టైమ్. పైసా కూడా అమ్మకపోవడం. జంక్షన్ లోవుంటూ అసలు బిజినెస్ లేకపోవడం చాలా విచిత్రంగా వుంది. ఆలోచిస్తే ఇదంతా దైవ స్వరూపులు మీ మహాత్మ్యమేనని తోచింది. మా ఆవిడ మిమ్మల్ని కలవమంది. క్షమార్పణలు చెప్పుకోమంది. మీరు క్షమించానని ఒక్కమాట చెప్పండి చాలు! వెళ్ళిపోతాను!" అన్నాడు బాధగా.

"దీనిలో ఇంత బాధపడవలసిందేముంది నాయనా! మీరంటే నాకు చాలా ఇష్టం. నిజాన్ని నిర్భయంగా అడుగుతారు. ముక్కుకు సూటిగా మాట్లాడతారు. కడుపులో ఒకటి బయటికి ఒకటి మాట్లాడరు. పైగా జరిగిందానికి పశ్చాత్తాప పడుతున్నారు. పశ్చాత్తాపం కంటే మించిన ప్రాయశ్చిత్తం ఏముంటుంది చెప్పండి" అన్నాడు. స్వామిజీ మొహం గర్వంగా వెలుగుతోంది.

"ధన్యుణ్ని స్వామి. మీ పూజ భంగం కలిగించినందుకు మన్నించండి" అంటూ వెనుతిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు గున్నారావు.

ఇదంతా తన కళ్ళను తాను నమ్మలేకపోయింది ధనలక్ష్మి.

"ఏమిటి స్వామిజీ ఇదంతకూ? నిజమా? గున్నారావు గారు ఇక్కడికి రావడమా? మనకి ఏదో ముప్పు తప్పదు" అంది భయంగా.

"లేదు. ఆయనలో పరివర్తన వచ్చింది. రాకపోతే ఊరుకుంటానా. దేవి ధ్యానంచేస్తే వాడు నిముషాల్లో నాశనమైపోతాడు. తెలివయినవాడు. ముందే తెలుసుకున్నాడు. క్షమార్పణలు చెప్పుకున్నాడు. నువ్వేం భయపడవలసిన అవసరంలేదు!" అంటూ ధనలక్ష్మిని గుండెకేసి హత్తుకున్నాడు.

తలుపులు గడియపడ్డాయ్ మళ్ళీ.

7

అదొక యల్లారమ్మ మెట్ట—

నగరప్పాలెం వెళ్ళేదారిలో వుంది. క్రింద అందమయిన సరుగుడు తోట—ఇంకా అందమయిన గోస్తనీనది సజీవంగా ప్రవహిస్తోంది.. తోట శబ్దం రివ్వుమంటూ నది శబ్దం హోరుతో వింతగా కలుస్తోంది.

"మన ముగ్గురం ఇక్కడ కలిసినట్టు మూడో కంటికి తెలియకూడదు!" అన్నాడు ఆదినారాయణ.

"అవును. చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి!" వంతపాడాడు స్వామిజీ.

"మూడో కంటికే కాదండీ బాబూ .... నాలుగో కంటికి తెలీకూడదు" అన్నాడు సుబ్బయ్యశెట్టి. ఆదినారాయణ నగల ప్రస్తావన తీసుకొచ్చాడు.

"శెట్టీ! ఈ నగలు నువ్వే తీశావని నాకు అనుమానమయ్యా! ఎందుకంటే తాళంచెవులు ఆ పంతులు దగ్గర పోయి నలభయ్ సంవత్సరాలవుతుంది. ఇప్పుడు అతగాడ్ని అనుమానించడం మంచిది కాదు కదా!" అన్నాడు.

శెట్టిగారి గుండాగిపోయింది.

స్వామిజీ, ఆదినారాయణ మొహంలోకి వింతగా

చూశాడు.

"అవును స్వామిజీగారూ!" అని నిర్ధారణగా తలూపేడు ఆదినారాయణ.—

"అదేవిటి భూతవైద్యుడి అరచేతిలో పంతులుగారు భూతద్దంలో చూసినట్టు కనిపించారు కదా—" నొచ్చుకున్నాడు శెట్టి.

"దానికేముంది శెట్టిగారూ! ఎవడిమీద అనుమానం వుంటే వాడే కనిపిస్తాడు. మళ్ళీ వెళితే మీరు కనిపించాలనుకుంటే మీరే కనిపిస్తారు. ఇదంతా మాయ. ఆ నగలు కనీసం నాలుగయిదు లక్షలు వుంటాయి. ఇందులో మా భాగం ఎంత? ఇది గుట్టుచప్పుడుకాకుండా తొక్కిపెడతాను. అవసరమయితే మినిష్టర్ లెవెల్‌లో మాట్లాడి కామప్ చేస్తాను. నాకో లక్ష నగదు పారెయ్. అలాగే ఆ చేత్తో స్వామిజీకి ఎంతిచ్చుకుంటావో మరి ఆయన ఎంత డిమాండ్ చేయాలనుకుంటున్నాడో మీరు మీరూ తేల్చుకోండి!" అన్నాడు తాపీగా.

సుబయ్య శెట్టికి భూమి ఆకాశం కలిసి తిరుగుతున్నట్టనిపించింది.

"ఇది అన్యాయం ఆదినారాయణగారూ! నా పిల్లల సాక్షి. నా ఇద్దరి పెళ్ళాల సాక్షి. ఆ నగలు నాకు తెలీదు. దొంగ వ్యాపారం చేశానంటే ఒప్పుకుంటాను. బియ్యంలో మట్టిగడ్డలు కలిపేశంటే ఓ.కే. అంటాను. పాలడబ్బాలో మైదా కలిపేనంటే సరే. 'నగలు' దోపిడీ ఎలా జరిగిందో నాకు తెలీదు! తెలీదంటే తెలీదు బాబోయ్. అదిగో ఆ అమ్మోరు సాక్షి!" అన్నాడు అమ్మోరివంక ఏడుస్తూ చూసి.

"శెట్టిగారూ తాతకి దగ్గులు నేర్పకండి. ఆ రాత్రి

మీ రే వెళ్ళి నగలు తీసివుంటారు. స్వామిజీగారు చూసి వుంటారు. ఎందుకనో స్వామిజీగారు మౌనం వహిస్తు న్నారు. నగలు గురించి మీకు తెలీదా! దైవస్వరూపులు!" అని వ్యంగ్యంగా అన్నాడు. స్వామిజీ ఉలిక్కిపడ్డాడు.

"నిజం ఆదినారాయణగారూ నాకు తెలీదు" అన్నాడు స్వామిజీ.

"అయితే ఆ తాళంచెవులు ఆ రాత్రి ఎవరికయినా ఇవ్వడం జరిగిందా!" ఆదినారాయణ 'క్లూ' లాగడానికి ప్రయత్నించాడు.

"ఎవరికిస్తాను. మా 'ధనం'కిస్తాను. ధనం ఇనప్పెట్టెలో భద్రంగా పెడుతుంది. ఈ విషయం మూడో కంటికి తెలీదు!"

"మీ భార్య ఈ నగల దోపిడీ చేసిందని ఎందుకనుకో కూడదు!"

స్వామిజీ షాక్ తిన్నాడు.

శెట్టిగారు ఆలోచనలో పడ్డాడు. క్షణంలో తేరుకుని "రామ రామ! ధనం అలాంటిది కాదు. ఇన్ని లక్షలు బిజినెస్ దాని పేరిట టర్నోవర్ అవుతుండగా అమ్మవారి నగలమీద ఆశపడుతుందా! అయినా దానికి అలాంటి పాపిష్టి ఆలోచనలు రావు. వచ్చినా దోపిడీ చేయడానికి ధైర్యం చాలదు. అది నాకంటే పిరికి సన్నాసి! లేదు ఆదినారాయణగారూ! మీరు తప్పుడు అంచనాలు వేసి మమ్మల్ని వీధిలోకి లాగాలని చూస్తు న్నారు. మీరు రహస్యంగా సమావేశం అవుదామన్నా రంటే మా మంచికోరి నాలుగు మాటలు చెపారను కున్నాను గాని, హార్టు ఎటాక్ తెప్పిస్తారనుకోలేదు!" అన్నాడు బాధపడుతూ.

"శెట్టిగారూ! మీరు బాధపడ్డం దేనికి. ఇంట్లో రేపు సోదా చేస్తానని గున్నారావుగారు చెప్పేరుకదా—అపుడు తెలిసిపోతాయికదా నిజానిజాలు" అని ఓదార్చాడు స్వామిజీ.

"చాల్లెండి. నగలు దొంగతనం చేసినోళ్ళు ఇంట్లో దాచుకుంటారా....ఏ బావిలోనో ఏ పాడుబడిన కొంప లోనో దాచుకుంటారు. సరే మీ ఇష్టం. ఇందులో నేను చేయగలిగింది ఏం వుండదు. ఆ గున్నారావు మీ అంతు చూస్తాడు. అపుడు మూడు లక్షలు కాదు—నాలుగు లక్షలు నగదూ ఆయనకే ఇస్తానన్నా ఒప్పుకోడు. ఆలోచించుకోండి! నాతో రాజీపడాలనుకుంటే రేపు ఉదయం తొలిజాము అంటే నాలుగ్గంటలముందే మా ఇంటికి రండి!" అంటూ విసురుగా లేచాడు ఆదినారాయణ.

పరిస్థితి అయోమయంగా కనిపించింది. శెట్టిగారు మౌనంగా అనుసరించాడు.

"ఓం నమశ్శివాయ" అంటూ లేచాడు యోగానంద స్వామిజీ.

8

నమశ్శివాయ పంతులుగారి ఇల్లంతా సోదా చేశారు. ఒక్క పైసా దొరకలేదు. గున్నారావు, ఆదినారాయణ, తదితర పెద్దలు, శెట్టిగారు ఒకరి మొహాలు ఒకరు చూసు కున్నారు.

"పదండి వెళదాం. పంతులుగారూ .... అనుమానం వున్నప్పుడు ఇలా సోదా చేయడం సర్వసామాన్యమయిన విషయం. మీరు బాధపడకండి!" అంటూ లేచాడు గున్నారావు.

పంతులుగారి చంటాడు శివయ్య చేతిలో ఏదో

ధగధగా మెరుస్తోంది. కళ్ళు ఇంతలేసి పెట్టి చూశాడు శెట్టిగారు.

"అదిగో అమ్మవారి కాళ్ళ మట్టెలు. బంగారు మట్టెలు. ఆ దొంగనా కొడుకు దగ్గరున్నై" అన్నాడు ఆతృతగా.

నమశ్శివాయ పంతులుకి గుండాగినంత పనయింది. నిజమే! శివయ్య చేతిలో బంగారు మట్టెలు. సాక్షాత్తూ పార్వతీదేవి మట్టెలున్నాయి.

"బాబూ! ఇది నీకెవరిచ్చారు?" అనడిగాడు పంతులు.

భ్రమరాంబకేసి చూపించాడు.

"భ్రమరాంబా....ఇలారా!" ఇల్లంతా నిశ్శబ్దం ఆవహించింది.

"ఈ బంగారు మట్టెలు ఎక్కడివి?"

"మన అరటిచెట్టు క్రింద దొరికాయి నాన్నా!" అంది భయపడుతూ.

నమశ్శివాయ అరటిచెట్టు దగ్గరికెళ్ళి మొదలు తవ్వాడు. అమ్మవారి నత్తు, బేసరి దొరికాయి.

గున్నారావు తన కళ్ళను తనే నమ్మలేకపోయాడు.

"అయ్యా గున్నారావుగారూ! ఇదేదో మాయ. నా ఇంటిలో పార్వతీదేవి నగలు వుండటం వింతగా వుంది!" అని నెత్తిబాదుకున్నాడు.

"అవునయ్యా! వింతగానే వుంటుంది మరి — మొత్తం నగలు ఎక్కడ దాచావో చెప్పేంతవరకూ ఆ శివాలయంలోనే నిన్ను విరిచికడితే అవే ఒక్కొక్కటి కనిపిస్తాయి!" సుబ్బయ్యశెట్టి మండిపడ్డాడు.

"ఏది ఏమయినా పంతులుగారూ! దొంగతనం మీరే చేశారనడానికి ఆధారాలు చాలవూ?" ఆదినారాయణ అడిగాడు.

పంతులుగారి బావి దగ్గర 'తాళం' కనిపించింది.

"అదిగో గున్నారావుగారూ! అమ్మవారి గర్భగుడికి సంబంధించిన తాళం—ఇంతవరకూ తాళాలు పోయాయని నాటకమాడాడు. ఇది అమ్మవారి గర్భగుడి తాళమేనా?" అని నమశ్శివాయ పంతుల్ని నిలదీశాడు శెట్టిగారు. అవు నన్నట్లు తలూపేడు నమశ్శివాయ పంతులు.

"ఇప్పుడు నిస్నేం చేయాలి?" శెట్టి మండిపడ్డాడు.

"చెప్పేరుగా కోవిల్లో విరిచికట్టండి!" అన్నాడు.

"గున్నారావుగారూ చూశారా! అనవసరంగా నన్ను అనుమానించారు. పంతులుగారి నిజ స్వరూపం ఇప్పటి కయినా తెలిసిందా! ఇతడు మేకవన్నె పులిలాంటి వాడండీ. ఒకరోజు ఆలయంలో వుంచండి. మరుసటి రోజుకి నగలు పుట్టుకరాకపోతే నన్నడగండి!" అంటూ పంతులుగారిని తీసుకుని శివాలయంకేసి నడిచారు.

గున్నారావుకి అంతా అయోమయంగా వుంది. దొరికిన వస్తువుల్ని భద్రంగా వుంచాడు. ఇంకా ఏమయినా దొరుకుతాయేమో వెదకమని కొంతమంది మనుషుల్ని నియమించాడు.

శివాలయం దగ్గరికి పంతులుగారు చేరేసరికి స్వామిజీ ఎదురు చూస్తున్నాడు. తదితర పెద్దలందర్నీ చూసి కంగారుపడ్డాడు.

"అయ్యా! అపరాధం జరిగిపోయింది" అంటూ శెట్టిగార్కి, గున్నారావుగార్కి ఎదురు వచ్చాడు.

"ఏం జరిగింది?" అనడిగాడు.

"అమ్మవారి వడ్డాణం నా పూజగదిలో వుంది. ఎలా వచ్చిందో తెలీదు. ఇది సత్యం? ఆ జగన్మాత సాక్షిగా చెబుతున్నాను!" అంటూ వడ్డాణం గున్నారావు చేతికి

అందించాడు.

అంతా ఒకరి మొహాలు ఒకరు చూశారు.

"పంతులుగారూ! అమ్మవారి వడ్డాణం ఇదేనా!"

"సాక్షాత్తూ ఇదే బాబూ!" అన్నాడు నమశ్శివాయ పంతులు.

"ఇంకేం వున్నాయో చూడండి! స్వాములవారయి వుండి తమరిలా కక్కుర్తి పడతారనుకోలేదు. ఇంకా ఏయే నగలు తమరివద్ద వున్నాయో సెలవిస్తే మంచిది!" అన్నాడు గున్నారావు.

ఆదినారాయణకి ఇదంతా అగమ్యగోచరంగా వుంది. తన డబ్బయి సంవత్సరాల సర్వీసులో ఇలాంటి సంఘటన ఒక్కటీ జరగలేదు. పంతులుగారింట్లో బంగారపు ముట్టెలు, తాళంచెవి దొరికింది. ఇక్కడ అమ్మవారి వడ్డాణం దొరికింది. అసలు దొంగ ఎవరయివుంటారు చెప్మా? ఆలోచనలో పడి తల గోక్కున్నాడు.

"శెట్టిగారూ! తమరు ప్రవేశపెట్టిన స్వామిజీ సన్నిధిలో అమ్మవారి వడ్డాణం దొరికింది. ఇపుడేమంటారు. ఎవరు దొంగనాకొడుకు?" అనడిగాడు గున్నారావు.

"అమ్మమ్మ .... అంతమాటనకండి. ఇందులో ఏదో మోసం జరిగి వుంటుంది. స్వామిజీమీద నాకు నమ్మకం వుంది" అన్నాడు శెట్టి.

"మీ నమ్మకాలు ఎవడిక్కావాలండీ. మీ భార్య మీద మీకు నమ్మకం వుండొచ్చు. మాకు వుండొద్దూ!" గుట్టు లాగడానికి ప్రయత్నించాడు.

"గున్నారావుగారు అసభ్యంగా మాట్లాడుతున్నారు."

"లేదండీ నిన్న మీరు విశాఖపట్నం వెళ్ళారుకదూ. అపుడు మీ భార్య అంటే సాక్షాత్తూ మీ సతీమణి—

తొమ్మిది గంటల ఇరవై నిముషాల ప్రాంతంలో స్వామిజీ పూజలో నిమగ్నమయిపోయి వుంది. జుత్తు చెదిరిపోయినా స్వామిజీ గుండెమీద ఆమె బొట్టు అంటుకున్నా గుడ్డలూడిపోయినా మీరు నమ్మతారు. మీ భార్య పతివ్రత. ఆయన సాక్షాత్తూ భగవంతుడు. కాని లోకం కళ్ళు మూయగలరా?" అనడి గాడు.

శెట్టి స్వామిజీ మొహంలోకి చూశాడు.

"ఇదంతా అబద్ధం. నాకేం తెలీదు. ఆమె పరమ పతివ్రత — నేను ఆ సమయంలో ఆమె వేదాంత రహస్యాలడుగుతుంటే చెబుతున్నాను. ఇంతకు మించి మాకే పాపం తెలీదు. ఈయన వచ్చినప్పుడే గ్రహించాను. మా మీద ఏదో కుట్ర పన్నుతాడని — మొదట్నుండీ నన్ను ఆడిపోసుకుంటున్నాడు. ఇప్పుడే అభాండం వేశాడు.... మాతా....ఇందుకు నువ్వే సాక్షి!" అన్నాడు మంత్రం జపిస్తూ.

"తాళంచెవి దొరికింది!" అంటూ ఒకడు తీసుకొచ్చాడు.

"ఆ తాళంచెవి అమ్మవారి నగలపెట్టె తాలూకు తాళంచెవి" అన్నాడు శెట్టి.

"ఇక్కడికెలా వచ్చింది. అయ్యా....అంతా గందరగోళంగా వుంది" అన్నాడు ఆదినారాయణ.

"శెట్టిగారూ! ఇపుడేమంటారు?" మింగేసేలా చూశాడు గున్నారావు.

"ఈ స్వామిగాడ్ని కూడా ఈ శివాలయంలో విరిచి గట్టండి. ఇద్దరు భక్తులు కలిసి ఆడిన నాటకం ఇది. తెల్లారేవరకూ వుంటే వాళ్ళే నిజం చెబుతారు" అన్నాడు సుబ్బయ్య శెట్టి.

9

"లక్ష్మీ!"

"ఊ!" మత్తుగా పలికింది. ధనలక్ష్మి, రాజు ఒడిలో పడుకుంది. విశాఖపట్నం బీచ్ లో పలుచగా మనుషులున్నారు. ఓరగా కూర్చున్నారు ధనలక్ష్మి, రాజు ఇద్దరూ. రాజు మహా అందగాడు. మగాళ్ళకే ముద్దొచ్చేంత అందగాడు. ధనలక్ష్మికి తను అపర సత్యభామనన్న గర్వం చిన్నప్పటినుండీ వుంది.

"రాజూ....మనం ఇలా వారానికి మూడుసార్లు కలుసుకోవడం ఏం బాగులేదు—మా ఆయన చీటికిమాటికి విశాఖపట్నం ఎందుకు? ఎంత బంధువులయితే మాత్రం అపార్థం చేసుకోరూ? అని ఒకటే కాకి గోల—దీనికి మనం ఏదో ఆలోచించాలి!" అంది రాజు క్రాపింగ్ లో చూపుడు వ్రేలు పోనిచ్చి సుతారంగా మీటుతూ.

"లక్ష్మీ! నిన్ను పువ్వుల్లో పెట్టి పూజించాలనివుంది. కాని ఏం చేయను. నేను నిరుద్యోగిని. ఈ దేశం నిరుద్యోగుల కల్పవల్లి. నువ్వా — చిన్నప్పటినుండీ, నేతి ముద్దలతో తిని, ఎంతో గారాబంగా పెరిగావు. నువ్వు ఇపుడు అర్ధాంతరంగా వస్తే నిన్ను పోషించుకోలేని దుస్థితి నాది. ఏం చేయమంటావు చెప్పు!" బాధగా మొహం దాచుకున్నాడు.

"నువ్వలా బాధపడకు రాజూ .... నా బాధ అర్థం చేసుకుంటావని చెప్పేను. మా ఆయనొక జడపదార్థం. ఆయనకు డబ్బు సంపాదించడంతప్ప ఓ అచ్చటా ముచ్చటా తెలీదు. భోంచేయగానే గుర్రుపెట్టి నిద్రపోతాడు. నేనూ ఉప్పూ కారం తినే ఆడదాన్ని. చేసిన తప్పు ఫ్రాంక్ గా చెబుతున్నాను. మీరు అపార్థం చేసుకోకండి. మా

ఆయన అసమర్థతవలననే స్వామిజీని మరిగేను. ఆయన బ్రహ్మచారి. బలంగా వుంటాడు. నాకు శారీరకంగా సుఖాన్నిస్తున్నాడేగాని మానసికంగా ఏ విధమైన తృప్తిని ఇవ్వలేదు. పైగా ఈ మధ్య ఆలయంలో ఏవో నగల కేసులో ఇరుక్కున్నాడు. నిజం ఏవిటో నాకు తెలీదు. అలాంటి వాళ్ళతో సంబంధం మంచిదిగాదు. పైగా మా ఊరికి నిప్పులాంటి మనిషి గున్నారావు. ఆయన మా ఇద్దర్ని కలగలిపి చూశాడు. మా సంగతి ఏ క్షణంలో నయినా బయట పెట్టొచ్చు—అసలు ఆయన నా విషయం కదిపేలోగా మనం ఎక్కడికయినా దూరంగా పారి పోదాం!" అంది.

రాజు, లక్ష్మి మొహంలోకి అలాగే చూస్తూండి పోయాడు.

"అబ్బా....ఏంటండీ అలా మింగేసేలా చూస్తారు?"

"నువ్వు ఎంత అమాయకురాలివా అని— నేను ఫలానా మగాడితో తిరిగానూ అని ఇంత నిర్భయంగా చెబుతున్నందుకు నీ నిజాయితీకి జోహార్లు. లక్ష్మి! తప్పులు అందరూ చేస్తారు. నేను మాత్రం వయసులో ఎన్ని తప్పులు చేయలేదు!"

ధనలక్ష్మి, రాజు నోరు మూసేసింది—

"వొద్దండీ మీ గురించి చెప్పద్దు. మీరు ఎంతమందితో తిరిగారో ఎలా తిరిగారో నాకనవసరం! నేను మీ జీవితంలో ప్రవేశించాలి. మీరు నాకే సొంతం కావాలి! మిమ్మల్ని మరొకరు పంచుకుంటే నేను బ్రతకలేను. మీరు మరొకరి పొందు కోరిన తక్షణం నా శవం మీకు కనిపిస్తుంది!" అంది ధనలక్ష్మి. కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది.

"డోంట్ వర్రీ లక్ష్మి! ఇదిగో స్టీల్ ప్లాంట్—

త్వరలో తయారవుతుంది. అందులో ఇంజనియర్ గా నన్ను వేసుకుంటానని మేనేజింగ్ బోర్డులో ఓ పెద్ద మనిషి మాటిచ్చాడు. ఈలోగా వర్క్ షాపు పెట్టాలని సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీమ్ క్రింద గవర్నమెంట్ దగ్గర లోన్ కోసం అప్లయ్ చేశాను. నెల రెండు నెలల్లో వస్తోంది. మన సమస్యలన్నీ గట్టెక్కిపోతాయి!" లక్ష్మి తల నిమురుతూ చెప్పాడు.

"రాజూ! అంతవరకూ వుండేలా లేదు నా పరిస్థితి. ఎందుకో క్షణం క్షణం భయంగా వుంది. మనశ్శాంతి కరువౌతుంది. బహుశా భర్తను మోసం చేసి తిరుగుతున్న ప్రతి ఆడదానికీ ఈ చిత్రహింస తప్పదనుకుంటాను. మా వారిని చూసినపుడల్లా గిల్టీగా ఫీలవుతాను— రాజూ నీతోనే వుంటాను. వుంటే తింటాను. లేకపోతే పస్తులుంటాను.

నేను నువ్వనుకున్నట్లు నేతిముద్దలు తిని పెరగలేదు. కలో, గంజో తాగి, లేకపోతే పస్తులుండి పెరిగాను. ఆయనకు మొదటి భార్య చనిపోయిం తరువాత రెండు మూడు సంవత్సరాలు పెళ్ళికాలేదు. పెళ్ళీడు వచ్చిన పిల్లలు ముగ్గురు, చంటిపిల్లలు ముగ్గురూ వున్నారు. మనిషి అప్పటికే మదపుటేనుగులాగా వుండేవాడు. అయితే మా అన్నయ్య, వదినలని డబ్బుతో లొంగదీసుకున్నారు. పేద ఇంట్లో పుట్టడంవలన డబ్బుతో మగవాడ్ని కట్నం ఇచ్చి కొనలేని స్థోమత లేనందున కట్టబెట్టేశారు. నా గొంతుకు ఉరితాడు బిగించాడు. నేను నీతో గంజి తాగయినా.. పస్తులుండయినా స్వేచ్ఛగా బ్రతికాలను కుంటున్నాను రాజూ!"అంటూ కాళ్ళమీద పడి ఏడ్చింది.

"నిజమే లక్ష్మి! మరోసారి ఆలోచించు! కనీసం

వర్క్ షాపు పెట్టాలంటే అయిదారు లక్షలుండాలి. రేపు మా ఇంటికి వెడతాను. మావారితో ఆస్తిపంపకాలు చేయమంటాను ... నా వాటాకి అయిదు లక్షలు వస్తుంది. అది తీసుకొచ్చేంతవరకూ ఆగు! నన్ను విజయవాడ వెళ్ళిరానీ. అంతవరకూ ప్రశాంతంగా వుండు. నీకేం భయంలేదు!" అని ధైర్యం చెప్పాడు.

10

ఉదయం శివాలయంలోకి గ్రామ పెద్దలు, శెట్టిగారు అడుగుపెట్టేసరికి స్వామిజీ శవం కనిపించింది. నమశ్శివాయ స్పృహతప్పి పడివున్నాడు.

గున్నారావు, పంతులుగారి మొహంమీద నీళ్ళు చల్లాడు.

నమశ్శివాయ పంతులు భారంగా కళ్ళు తెరిచి చూసేసరికి ఎదురుగా స్వామిజీ శవం. 'పరమశివా' అని గట్టిగా అరిచాడు.

"కాదు పచ్చి మోసం. గున్నారావుగారు ఇదంతా నాటకం. ఈ పంతులే స్వామిజీని హత్యచేసివుంటాడు!" అని అరిచాడు శెట్టి.

స్వామిజీ కడుపులో పొడిచారు. ప్రేగులు బయటికి వచ్చాయి. కత్తితో పొడిచినట్లు స్పష్టంగా కనపడుతుంది.

నమశ్శివాయ చేతులకు రక్తం వుంది.

"అదిగో! పంతులుగారి చేయి చూడండి. రక్తం! ఇది దారుణం. ఇంతవరకు గజదొంగ అనుకున్నాను. ఇపుడు హంతకుడు కూడానా. వీడే స్వామిజీని కత్తితో పొడిచివుంటాడు. కత్తి కనిపించకుండా భద్రంగా దాచి పెట్టివుంటాడు. లాభంలేదు. ఇలాంటివాణ్ని మనం

పంచాయితీలు జరిపించి విచారించి ప్రయోజనంలేదు. సెంట్రల్ జైలుకి పంపించవలసిందే!" అన్నాడు శెట్టి గారు.

"పంతులుగారూ ఏమిటండీ ఇదంతా!" గున్నారావుకి మళ్ళీ పజిలింగ్ ప్రారంభమయింది. స్వామిజీకి దోపిడీకి సంబంధంవుందా? వుంటే స్వామిజీని ఎవరు చంపుతారు? పంతులుగారు చంపరు? చంపరని తన మనసు ఎందుకో గట్టిగా చెబుతుంది. ఈ నగల దోపిడీతో సంబంధంవున్న వ్యక్తి మరొకరెవరో చంపాలి? లేదా? అది శెట్టిగారే ఎందుకు కాకూడదు.

"శెట్టిగారూ! తమరు ఆవేశపడకండి! ఆకలిమంటలతో నిండా భారంతో సగం చచ్చిన పంతులుగారు ఈ హత్య చేశారంటే నేను నమ్మను. ఈ నగల దోపిడికి మీకూ ఎక్కువ సంబంధం కనబడుతుంది. ఇందులో ఏదో 'మాస్టర్ ప్లాన్' వుంది. మీరే స్వామిజీని చంపొచ్చుగా!" అన్నాడు.

"నేనా .... హత్యా .... నే నెవరనుకొని మాట్లాడుతున్నారండీ!"

"ఏం_గుడిలో నగలు దోపిడీ చేయగాలేంది హత్య చేస్తే తప్పా! మీరే మీ భార్యనీ ఇతన్నీ అనుమానించి ఆమెను చెరచిన కారణంగా ఓర్చలేక హత్య చేయొచ్చుగా!" ధైర్యంగా ప్రశ్నించాడు గున్నారావు.

"అవున్రా అయ్యా. ఇదీ పాయింటే!" వంత పాడాడు ఆదినారాయణ. మిగతా జనం గుడ్లప్పగించి చూస్తున్నారు. శెట్టి మొహం చెమట్లు పట్టింది. నరాలు స్వాధీనం తప్పుతున్నాయి.

"గున్నారావుగారూ! ఇదన్యాయం. ఈ హత్య నేను

చేయలేను. ఈ నగల దోపిడీకి నాకు సంబంధంలేదు. కావాలంటే ఏ ప్రమాణం అయినా చేస్తాను. గుళ్ళో దీపం ఆర్పమంటే ఆర్పుతాను!" అన్నాడు సుబ్బయ్యశెట్టి.

"దీపాలు ఆర్పిన తరువాతనే గదా శెట్టిగారు దోపిడీ ప్రారంభమయ్యేది!"

"లేదు గున్నారావుగారు! ఈ హత్య నేను చేయలేదు. స్వామిజీకి మా ఆవిడకీ సంబంధం వుందని మీరు చెప్పక ముందే తెలుసు. నా వలన పొందలేని సుఖం అతనివలన పొందుతుంది. అందుకు నేను ఆయనమీద పగ, ద్వేషం, లాంటివి ఏవీ పెంచుకోలేదు. నాకే ఇది గుండె మంటయితే ఈ భాగవతం తెలిసిన మరుసటి క్షణాలో స్వామిజీని హత్యచేసి, శవాన్ని మాయంచేసి వుండేవాణ్ని! ఈ హత్య నేను చేయలేను బాబోయ్!" అంటూ భోరున ఏడ్చాడు.

"నమశ్శివాయగారూ! మీరేవన్నా ఈ హత్యా ప్రయత్నాన్ని చేశారా!" ఆదినారాయణ అడిగాడు.

"శివశివా! లేదండీ ఈ పాపాన్ని మూటగట్టుకో మంటూరా. నా ఇంటిలో అయిదుగురు పిల్లల్ని ప్రతి రోజూ జీవ హత్య చేస్తూనే వున్నాను—ఆకలిమంటలతో చంపుతూ. ఆ పాపం చాలదూ. ఏదో నా కాలం దగ్గర పడింది. పూర్వజన్మ పాపఫలితం ఇప్పుడు అనుభ విస్తున్నాను. రాత్రి ఏం జరిగిందో నాకు తెలీదు, మీరు నన్ను మేల్కొలిపేవరకూ నేనెక్కడున్నానో తెలీదు. ఆ పరమేశ్వరుని సాక్షిగా!" అన్నాడు నమశ్శివాయ పంతులు.

"అయితే ఈ హత్య ఎవరు చేశారు?" గున్నారావు ఆలోచనల్లో పడ్డాడు—"అయ్యా! మన ఊరికే ఏదో

ముసురుకుంది—చెడిపోయే కాలం వస్తే ఇలాగే దాపురిస్తాయన్నీ. ఇంతవరకు 'నగల దోపిడీ' ఒకటే సమస్యనుకుంటే, దాంతోబాటు స్వామిజీ హత్య మరో సమస్యయి మన నెత్తిమీద కూర్చుంది. గున్నారావూ! మనం చేయగలిగినంతా చేశాం. పద! విశాఖపట్నం వెళ్ళి పెద్దోళ్ళకి రిపోర్టు చేసేస్తేగానీ ఇది అంత తేలిగ్గా తేలదు!" అన్నాడు చుట్ట వెలిగిస్తూ.

"సమ్థింగ్ ఈజ్ గోయింగ్ రాంగ్!" అంటూ ఆలోచనల్లో పడ్డాడు గున్నారావు. మిగతా కార్యక్రమాల కుపక్రమిస్తూ.

11

"అబ్బా .... ఎంత ప్రశాంతంగా వుంది లక్ష్మీ!" అన్నాడు చొక్కా విసిరి యుఫోమ్ డబుల్ బెడ్ పై మేనువాలుస్తూ రాజా.

సుబ్బయ్య శెట్టి స్థానంలో రాజు చింతపండు స్థానంలో మేలిమి బంగారంలా మెరిసినట్లయింది. రెప్పార్పకుండా రాజుని అలాగే చూస్తూ వుండిపోయింది.

"పిల్లలంతా ఎక్కడికి వెళ్ళారు?" రాజు అడిగాడు.

"పాండ్రంకి వెళ్ళారు. వాళ్ళ తాతగారింటికి—మా ఆయన విశాఖపట్నం వెళ్ళారు—అమ్మవారి నగల కేసు విషయంలో. ఈలోగా మన వ్యవహారం పరిష్కారం కావాలి.... చెప్పు రాజా .... ఏవిటి — మీ వాళ్ళింటికెళ్ళావు కదా ఏమంటారు మీ వాళ్ళు—నీ చేత ఇంజనీరింగ్ వర్క్ షాపు పెట్టిస్తారటా!" అనడిగింది.

"లక్ష్మీ! మా యింట్లో ఈ విషయం కదిపేను" అన్నాడు.

ఆశగా తృళ్ళిపడి లేచి ఏమన్నారు? అన్నట్లు

చూసింది. రాజు గుండెమీద తల ఆన్చి రెప్పార్పకుండా అతని కళ్ళల్లోకి చూస్తోంది.

“వాళ్ళు ఒప్పుకోలేదు. నా ఇంట్లో నాకంటే ముందు వాళ్ళు నా తరువాత వాళ్ళు వున్నారు. వారందరికీ చదువుసంధ్యలు పూర్తవ్వాలి. వారికి గవర్నమెంటు ఉద్యోగాలు దొరకాలి. ఎవరిమటుకు వారికి పెళ్ళిళ్లవ్వాలి. అర్డరులో నేను మూడవవాణ్ని. పెద్దవాడికి లక్ష అడుగుతున్నారు కట్నం. రెండవవాడికి ఒకటిన్నర, నామీద రెండు ఎక్స్పెక్ట్ చేస్తున్నానన్నారు—ఛీ-ఛీ కట్నాలు తీసుకుని పెళ్ళిచేయడానికి సిగ్గులేదూ. ఈ డబ్బంతా ఎవర్ని కప్పెట్టుకోడానికి అని ఎదురించాను. పెద్దన్నయ్య చాచి చెంప వాయించాడు. తిరగబడితే వాడిని పులుసులోకి దుమ్ము కూడా మిగలకుండా తన్నగలను. నాకు విద్యాబుద్ధులు చెప్పించాడు. చెప్పేడు అన్న గౌరవంకొద్దీ వూరుకున్నాను.

“ఒరేయ్ గాడిదా .... నేను మా నాన్నని ఆస్తి పంపకాలు వేయమని అడక్కుండా రెక్కలు ముక్కలు చేసుకుని స్వార్జితం అయిదు లక్షలు సంపాదించాను. ఆయన చనిపోయేముందు పదిలక్షలు నాకప్పగించారు. పట్టుకుపోయారు. మీకు నా పాతిక లక్షల ఆస్తి చిల్లిగవ్వకూడా ఇవ్వను. నేను చచ్చేంతవరకూ మీ తెలివితేటలతో మీరు సంపాదించండి. ప్రయోజకులుకండి. నేను పోయాక ఈ ఆస్తిలో ఎవరెవరికి ఎంతెంతె భాగం చెందుతుందో ధర్మబద్ధంగా వీలునామా రాసి మరీ పోతాను!” అన్నారు అంటూ చెప్పడం ఆపుచేశాడు రాజు.

రాజు యీ విషయం చెబుతున్నందుకు ఎంతగానో ఫీలయ్యాడు. తలదించుకున్నాడు.

"లక్ష్మీ! నీకు నేను తగను! ప్లీజ్ నన్ను మరిచిపో!" అన్నాడు.

ధనలక్ష్మి షాక్ ఫీలయ్యింది.

"ఏమిటి రాజూ జోక్ చేస్తున్నావా?" అంది నవ్వే డానికి ప్రయత్నించి నవ్వి.

"లేదు లక్ష్మీ. సీరియస్‌గానే చెబుతున్నాను. నీ అమాయకమయిన మొహం చూస్తూ అబద్ధం చెప్పలేను. నిన్ను మోసం చేయలేను. ప్రేమించాలంటే నాకు ఆస్తి, అంతస్థు, అర్హత వుండాలి!" అన్నాడు బాధపడుతూ.

రాజు మొహంలో రంగులు మారాయి. ధనలక్ష్మి కాసేపు ఆలోచనలోపడింది.

"సరే రాజూ! నువ్వు స్వయంగా ఇంజనీరింగ్ వర్క్‌షాపు పెట్టాలంటే ఎంత పెట్టుబడి కావాలంటావ్?"

"అమ్మా—ఆడదానివి! భర్తచాటు భార్యవి! నీ దగ్గర నాలుగయిదు లక్షలు ఆశించడం ఎంత స్వార్థం. లోకం ఏమనుకుంటుంది?"

"లీవ్ ఇట్ రాజూ....లీవ్ దట్ బ్లడీ ప్రపంచం! ఈ ప్రపంచాన్ని మనం విడిచిపెట్టేద్దాం. దూరంగా వెళ్ళి మనకో ప్రపంచాన్ని సృష్టించుకుందాం. నీకవసరమైన అయిదు లక్షల రూపాయలు నా దగ్గరున్నై."

"అయిదులక్షలా. అంత నగదు నీ కెక్కడిది?"

"కావాలనుకుంటే ఎంతయినా వస్తుంది. మా ఇంట్లో మా తాతముత్తాతల స్వార్జితం నగలున్నాయి. ఇవి అమ్మితే కనీసం నాలుగున్నర లక్షలు వస్తాయి. నా

దగ్గర ఒక లక్ష వరకూ కాష్ వుంది!" అంటూ లేచి లోపలికి వెళ్ళింది. లోపల ఏం చేసిందో పదినిముషాలు పోయిన తరువాత నగలమూట చిన్న బ్రీఫ్ కేసుతో కాష్ తీసుకొచ్చింది. రాజు కళ్ళు జిగేలుమన్నాయి. అంత బంగారం డబ్బు తనెప్పుడూ జీవితంలో చూడ లేదు.

"లక్ష్మీ! నాకెందుకో భయంగా వుంది!"

"డోంట్ వర్రీ. చాలా! మనం ఇక్కడ్నుండి వెంటనే బైటికి వెళ్ళిపోవాలి. మరు క్షణం వుండటం మనకి మంచిది కాదు!" అంది. ఆమె పెదవులు వొణుకుతున్నాయి. మొహం సింధూరంలా తయారయ్యింది. కళ్ళు బండి చక్రాల్లా తిరుగుతున్నాయి.

"ఏమిటి లక్ష్మీ .... ఎందుకీ కంగారు ఇపుడు ఏం కొంపలు మునిగిపోతున్నాయని. ఉదయం వెడతాం. ఇంట్లో పిల్లలు ఎవరూ లేరుగా! భయపడటానికి!" అని దగ్గరకు లాక్కున్నాడు. లక్ష్మి నగలమూట దగ్గరికి తీసుకుంది. సూట్ కేసులో పెట్టింది. బ్రీఫ్ కేసు తాళాలు వేసింది. రెండు తాళాలు జాకెట్ లోపల పడేసుకుంది.

"లక్ష్మీ—బి కూల్—నువ్వు తప్పు చేసినట్టుగా ఎందుకలా కంగారు పడతావ్-" పెదవి పట్టుకొని అడిగాడు.

"ఇద్దరికీ మంచికాలం కలిసి రావాలి కదా!" గున్నారావు గొంతు ఖంగుమంది. ధనలక్ష్మి మంచంమీద అల్లంత దూరంలో ఎగిరిపడింది.

"ష్! నువ్వేలా వచ్చావు. రాత్రిళ్ళు ఇలా బరితెగించి గోడ దూకి మరీ వస్తావా! నువ్వూ ఒక పెద్దమనిషేనా? ఇవి సంసారి కొంపలనుకుంటున్నావా? సానికొంపలనుకుంటున్నావా?" తిరగబడింది.

లక్ష్మి చెంప చెళ్ మంది.

భూమి ఆకాశం కలిసి తిరుగుతున్నట్టుగా అనిపించింది.

"రాజూ! చంపెయ్. వీడ్ని ఇక్కడే పాతేద్దాం!" అంటూ కత్తి అందించింది. రాజు పొడవబోయాడు. త్రుటిలో గున్నారావు చేతిలోకి వచ్చింది.

"ఎంతమంది నే నీ పొట్టన పెట్టుకుందామను కుంటున్నావు నేను అంత తేలిగ్గా చావనే — నిన్ను స్వామిజీనీ కలిసి చూసినపుడే నీ గుట్టు బయటపడింది. నీ మొగుడు నాకు నగల సంగతి తెలియును మొర్రో అని నెత్తి బాదుకున్నపుడే నీ గుట్టు బయటపడింది, నువు స్వామిజీని హత్య చేస్తావా? అది పంతులుగారిమీదకు తోస్తావా! ఛీ—నీదొక జన్మేనా—ఒక ధర్మకర్త పెళ్ళాంవి. ఊరందరినీ ధర్మమార్గంలో నడిపించవలసిం దానివి నువ్వే వక్రమార్గంలో నడిచి, హత్యలు, దోపిడీలు చేస్తే, రేపు ఈ ఊరుఊరంతా ఏమయిపోవాలి? నీ సాటి ఆడవాళ్ళు తలెత్తుకు తిరగ్గలరా?" నిలదీసి అడిగాడు.

"నో....నో.... నేను హత్యలు చేయలేదు. దోపిడీలు చేయలేదు. కావాలని నా మీద నిందవేస్తున్నారు.... ఏమండీ చూస్తారేమండీ ముందు వాడ్ని పంపించండి. కావలిస్తే కోర్టుకి రమ్మనండి. వాడు నా పాలిట యముడు లాగా వున్నాడండీ!" అంటూ బెదురుతూ ప్రాధేయ పడింది.

అప్పటికే జనం క్రింద మూగారు.

ఊళ్ళో ఒక్కొక్కరు పరుగెత్తి ఎవరో దొంగ దొరికి పోయిన అనుభూతితో క్రిందనుండి చూడసాగారు.

గున్నారావు ఘనలక్ష్మిని బరబరా ఈడ్చుకొచ్చాడు.

"ఊ ఆ సూట్ కేసులు బద్దలుకొట్టండి!" అన్నాడు.

జనం అంతా ఒక్కుమ్మడి మూగారు.

అందర్నీ దూరంగా వుండమన్నాడు ఆదినారాయణ. అందరూ ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఆదినారాయణ సూట్ కేసు బద్దలు కొట్టాడు.

"పరమశివా!" అన్నాడు పంతులు.

ధగధగమంటూ పార్వతీదేవి నగలు మెరుస్తున్నాయి. ఊరుఊరంతా ఆ నగల్ని పట్టిపట్టి చూడసాగారు.

"పంతులుగారూ! నగలన్నీ సరిపోయాయా? మిగిలి వున్నాయా?" గున్నారావు అడిగాడు.

"అమ్మవారి కాలుమట్టెలు, నత్తు, బేసరి, నడుంకి వడ్డాణం కనిపించడంలేదండీ!" అన్నాడు తృప్తిగా గుటకలు వేస్తూ పంతులుగారు.

"ఆ నగలూ నా దగ్గరే వున్నాయి కదరా గున్నారావూ" అంటూ సంచిలోంచి వడ్డాణం, పొట్లం విప్పి నత్తు బేసిరి మట్టెలుతీసి అమ్మవారి నగల్లో కలిపేడు—జనం అందరూ పరమేశ్వరుని, పార్వతిదేవి మహాత్మ్యాన్ని పొగిడారు.

"మరోసారి చూడండి పంతులుగారు సరిపోయాయా?" అని అడిగాడు ఆదినారాయణ.

"సరిపోయాయి బాబూ!" అన్నాడు నమశ్శివాయ పంతులు.

"మరీ బ్రీఫ్ కేసు?" అన్నాడు గున్నారావు.

"ఈ డబ్బు నాది. ఈయండి!" అంది కంగారుగా.

గున్నారావు పగలబడి నవ్వాడు.

రాజు కూడా శృతి కలిపేడు.

ఇద్దరూ కాసేపు తృప్తిగా నవ్వుకున్నారు.

"వెల్ డన్ మిస్టర్ మోహన్ రాజ్! బాధ్యతగల

పోలీసాక్షీసరువంటే నువ్వు. భగ్న ప్రేమికుడిగా ఎంత బాగా నటించావు?" అంటూ తన ఆప్తమిత్రుడు మోహన్ రాజ్ ని అభినందించాడు.

ధనలక్ష్మి గుండాగినంత పనయింది—ప్రయత్నంమీద తేరుకుంది.

"నటించడమేమిటి—రాజూ....ఏమిటిదంతా!"

"నీ డ్యూటీ నువు చేశావు. అదే 'నగల దోపిడీ'. నగలు నిన్ను ఆకర్షించాయి. దోపిడీ చేశావ్. నువ్వు ఒక పోలీసాక్షీసర్ని ఆకర్షించావు—నీ వెంటపడ్డాను. మరి బాధ్యతగల వ్యక్తిగా గున్నారావుగారు, బాధ్యతగల పోలీసాక్షీసరుగా నేను మేము ఇద్దరం మా డ్యూటీ మేం పెర్ఫెక్టుగా నిర్వర్తించినందుకు ఈ రోజు ఎంతో తృప్తిగా వుంది. తిరిగి అమ్మవారి నగలన్నీ ఒప్పగిస్తున్నందుకూ మాకెంతో గర్వంగా వుంది" అన్నాడు ఇన్స్పెక్టర్ మోహన్ రాజు.

"రాజూ .... !" అంటూ అరిచింది ఆకాశానికి వినిపించేలా. చేతులు చాచింది. సంకెళ్ళు పడ్డాయి. జీపు వచ్చింది. అర్ధరాత్రి పన్నెండు గంటల సమయం. జనం కిటకిటలాడిపోతున్నారు. ఛీకొడుతున్నారు. మొహాన ఉమ్మేతున్నారు. జీపు కదిలింది—

"గున్నారావుగారూ! మీరు....మీరు....బాబూ.... మంచితనం మాసిపోలేదు. ఇంకా వుంది—వుంది—కాబట్టే నా తల్లి నగలు తిరిగి వచ్చేయి. ఈ నగలన్నీ అలంకరించాలి. ఇప్పుడే అలంకరించాలి. అవి నేను చూడాలి. దయచేసి రండి. నా కోరిక మన్నించండి" అని ప్రాధేయపడి అడిగాడు.

ఆదినారాయణ తదితర పెద్దలు నగలు గుళ్ళో చేర్చ

డానికి బయలు దేరారు.

రాత్రి ఒంటిగంటయింది.

వేదోక్తంగా మంత్రాలు చదువుతున్నాడు నమ శ్శివాయ పంతులు. ఊరంతా ప్రతిధ్వనిస్తున్నాయి మంత్రాలు. నగలన్నీ అమ్మవారికి నమశ్శివాయపంతులు అలంకరించారు.

"చూశారా! తల్లి ఎంత ఆనందంగా వుందో. నా మీద పడిన నింద తొలిగిపోయింది. నాకు తృప్తిగా వుంది!" అంటూ నుదుటినిండా కుంకుమ పూసుకుని నమశ్శివాయ పంతులు పార్వతీదేవి పాదాలమీదపడి కళ్ళు మూశాడు.

—:ఐ పో యి ం ది:—